# మారిన మనిషి

శ్రీ ఎస్. చంద్రశేఖర్

తెల తెలవారుతుండగానే లేచి నాగలి భుజాన వేసుకొని పొలం వెళ్ళడం, ఎండ నక వాననకుండా భూమి దున్నడం, సూర్యాస్తమయపు వేళకు, పక్షులు గూళ్ళు చేరుకొంటుంటే, ఎడ్ల వెనక ఉత్సాహంతో యింటికి చేరుకోవడం గోవిందలాల్ దినకృత్యమైపోయింది.

గోవిందలాల్ ది తాటాకులతో కప్పబడ్డ ఓ చిన్న యిల్లు. ఆ యింట్లో గోవిందలాల్, అతనితల్లి రుక్మిణిబాయ్ వుంటున్నారు.

రుక్మిణీబాయ్ కి నలభై, యాభై సంవత్సరాల మధ్య వయసువుంటుంది. జుట్టు వెండిలా పండిపోయింది. మొహం ముడతలు పడింది.

గోవిందలాల్ ఆరోగ్యంగాను, బలిష్ఠంగా పొడుగ్గావుంటాడు. ఇరవై అయిదు సంవత్సరాల వయస్సుంటుంది. అతనెప్పుడూ నిర్విచారంగా వుంటాడు. ఉన్న దాంట్లోనే తృప్తిపడేరకం. కాని, అతని దవడమీదున్న, వికృతపు పెద్ద మచ్చవల్ల, చూచేవాళ్లకు భయంకరంగా కనబడతాడు. కాని ఎవరన్నా అన్యాయానికి తలపడితే, అతని మచ్చకన్న వికృతస్వరూపం దాలుస్తాడు.

గోవిందలాల్ అన్న, యుద్ధంలో చేరి, వీరస్వర్గం అలంకరించాడు. తండ్రి రెండు సంవత్సరాలక్రితమే చనిపోయాడు.

గోవిందలాల్ అన్న చనిపోయినందుకు ప్రభుత్వం ఆ కుటుంబానికి వెయ్యిరూపాయలు పరిహారం యిచ్చింది. తండ్రి పోతూ పది కుంట్లభూమి వదిలిపోయాడు. ప్రస్తుతం ఆ కుటుంబ జీవనాధారాలయ్యాయి.

గోవిందలాల్ కి వ్యవసాయం చేయడం బాగావచ్చు. తనకు వూహవచ్చిందగ్గర నుంచి, తండ్రితో పొలంపోయి, ఆయనకు అడపాతడపా సహాయపడుతుండేవాడు.

సంధ్య దీపాలు పెట్టేసరికి గోవిందలాల్ యిల్లు చేరుకొని ఎడ్లను కట్టేసి వాటిముందు చెత్త తీసేసి, మంచిగడ్డివేసాడు. వాళ్ళమ్మకు పొయ్యిలోకి కావలసిన కట్టెలన్నీ గొడ్డలితో కొట్టిచ్చాడు. రుక్మిణీబాయ్ అవి తీసుకొని "స్నానం చేసి రా నాయనా! అంతలో వంటచేసేస్తా" నంది "సరే" అంటూ భుజం మీద తువ్వాలు వేసుకొని కాలవవైపు బయలుదేరాడు.

అతను తిరిగివస్తుండగా, దీపపుకాంతి కిరణాలు తలుపుసందుల్లోంచి ఎంతో రమ్యంగా కనబడతోంది. ఆ కాంతి కిరణాలలో పొగచేరి మరింత స్పష్టంగా కనబడుతూ చక్కగా కనబడుతున్నాయి. యింటికి చేరేసరికి అతని 'జాగిలం' ఎక్కడా కనబడలేదు. నెమ్మదిగా ఈలవేశాడు. ఎక్కడనుంచి విన్నదోగాని, తోకాడించుకొంటూ, బుల్లి బుల్లి అడుగులు వేసుకొంటూ-కుంయ్! కుంయ్! అంటూ అతని దగ్గర చేరింది.

గుడిసెలో రుక్మిణిబాయ్‌కి ఊపిరిసలపకుండా పొగదట్టంగా నిండింది. పొగ బైటకు పోవడానికి ఎక్కడా సందు దొరకలేదు. అందుచేత యింకెక్కడా చోటు దొరకనట్లు ఆమెకళ్ళల్లోకి ముక్కులోకి కూడా దూరింది. ఆమెకళ్లునీళ్ళతో నిండిపోయింది. ముక్కువెంట నీరుకారుతుంది. యింక ఆమెకు ఊపిరి సలపడం కష్టమైంది. బైటకెళ్ళడానికి తలుపుతీసి బయటకొచ్చి చల్లగాలిలో కొంచెం సేపు హాయిగాగాలి పీల్చి తిరిగి వంటలో నిమగ్నమైపోయింది.

గోవిందలాల్ కొంచెం సేపు కుక్కతో ఆడుకొన్నాడు. కడుపులో ఆకలిదహిం చేస్తుంది. అమ్మపిలుస్తుందేమోనని ఎదురు చూస్తున్నాడు. కాని ఎటువంటి అలికిడి లేకపోయేసరికి తలుపుతీసుకొని సరాసరి యింట్లోకి వెళ్ళడు. రుక్మిణీబాయ్ శుభ్రంగా ఊడ్చి భోజనం పెట్టింది. గోవిందలాల్ ఆత్రుతగా నాలుగుమెతుకులు తిని కడుపు చల్లార్చుకొన్నాడు.

భోజనం అవగానే గోవిందలాల్ బయటకొచ్చి అరుగుమీద కూర్చుని ఆకాశంలో నక్షత్రాలు చూస్తున్నాడు. రుక్మిణిబాయ్ కూడా భోజనంచేసివచ్చి అతని ప్రక్కనే కూర్చుంది. కొంతసేపటివరకు ఎవరూ మాట్లాడలేదు. చివరకు రుక్మిణియే మొదలు పెట్టింది.

"ఏరా! నాయనా నేను బ్రతికుండగానే నీవొకింటివాడవైతే కళ్ళారా చూచి ప్రాణాలు విడుద్దామనుంది" అంది నిశ్వాసాన్ని చీలుస్తూ. గోవిందలాల్ ఏమీ మట్లాడలేదు.

"అదికాదురా; కన్యాలాల్ కూతురుంది చూచావ్ - దుర్గనందిని, ఆ అమ్మాయి చాల బాగుంటుంది. మనం అడిగితే కాదనడు. నీవు ఊఁ! అంటే చాలు రేపు నేవెళ్ళి కన్యాలాల్‌ని అడుగుతా" అంది.

గోవిందలాల్ ఆలోచించాడు. ఆ అమ్మాయి బాగానే వుంటుంది. ఆ అమ్మాయి వప్పుకొంటే తను నిక్షేపంగా వప్పుకోవచ్చు. ఒకవేళ ఒప్పుకొంటే తనకు డబ్బు కావలసివస్తుంది. కనీసం వెయ్యిరూపాయలన్నా ఉండాలి. పొలం

మీదవచ్చే ఆదాయం, కడుపునింపుకోడానికే సరిపోతుంది. యిదివరకు, తన అన్న చనిపోయినప్పుడు ప్రభుత్వం యిచ్చిన సొమ్ము ఎక్కడో దాచినట్లు అమ్మచెప్పింది- అది ఉపయోగించుకోవచ్చు.

"ఏం ఆలోచిస్తున్నావురా!" అనడిగింది.

"ఆఁ! ఏంలేదుగాని, నీయిష్టప్రకారమే కానివ్వు; అయితే ఒకవేళ వాళ్లుగాని ఒప్పుకొంటే. అన్నయ్య తాలూకు సొమ్ము వెయ్యిరూపాయిలు వాళ్లకిచ్చి దుర్గనందినికి నగలు చేయించమని యివ్వు" అని చెప్పి నిద్రకు పక్రమించాడు. రుక్మిణిబాయ్ సంతోషానికి అంతులేకపోయింది. ఏమేమో కలలుకంటూ నిద్రపోయింది.

ఆ మర్నాడే రుక్మిణీభాయ్ కన్యాలాల్ ఇంటికి వెళ్ళి ఆ సంబంధం ఖాయంచేసి, వెయ్యి రూపాయలు యిచ్చివచ్చింది. ఆ సాయంత్రమే గోవిందలాల్‌కి చెప్పింది.

ఆ తర్వాతకొంతకాలం వరకూ గోవిందలాల్ ఆవిషయంగురించి ఏమీ పట్టించుకోలేదు. పొలంలో యిదివరకుకన్న కష్టించి పని చేయడం మొదలు పెట్టాడు.

ఒక రోజున పొలంలో పని చేస్తూ, అటువేపు వెళ్లుతున్న దులారామ్‌ని చూచి ఆశ్చర్యపోయాడు. దులారామ్, తను చిన్నప్పటి స్నేహితుడు. ఈ మధ్య దులారామ్‌బొత్తిగా కనిపించడం మానివేశాడు. అతన్ని చూడగానే గోవిందలాల్‌కి ఎంతో సంతోషంవేసి పిల్చాడు.

"ఏరా! దులారామ్! ఎక్కడా కనిపించడంలేదే. యింతకాలంనుంచి ఎక్కడున్నావ్? ఏం చేస్తున్నావ్? యింటిదగ్గర అంతా కులాసా?" అంటూ అనేక ప్రశ్నలతో ముంచెత్తాడు.

"అంతాకులాసాగానే ఉన్నారు గాని, నీ వెట్లావున్నావ్? నీ పెండ్లి ఎప్పుడు" అనడిగాడు.

"నాపెండ్లికేం తొందరగాని? నీ పెండ్లెప్పుడుచెప్పావుకావు? అసలు యింతకీ దారి తప్పి యిట్లావచ్చావే?" అనడిగాడు. గోవిందలాల్

"నా పెండ్లికేంగాని, నా మిత్రుడు దుర్గాదాస్‌కి వివాహసంబంధం చూడ్డానికి వచ్చాంలే! అన్నట్లు నీవెరుగుదువా? ఆ చెరువుగట్టు ప్రక్కన పెద్ద అరుగుల యిల్లు లేదు. ఆయనే ... కన్యాలాల్. ఆయన కూతురుంది చూచావూ! దుర్గనందినీ చక్కనిచుక్క. ఆమెను దుర్గాదాస్‌కివ్వడానికి నిశ్చయమైంది. పెండ్లికి నీవుకూడా వస్తావుకదూ?" అనడిగాడు దులారామ్.

ఆ విషయం వినేసరికి గోవిందలాల్ నవనాడులన్నీ కృంగిపోయినట్లంది.

ముఖంలో నెత్తురుచుక్క లేనట్లు వెలవెల బోయింది. కాని ప్రక్కన స్నేహితు డున్నాడు. అందుచేత అతనేమీ తొట్రుపడకుండా

"ఆదుర్గాదాస్‌ని, నేనెరగను. పెళ్లికి నేనెల్లావస్తాను." అన్నాడు.

"నేనున్నానుగా మరేంపర్వాలేదు! అయితేవస్తాను. చీకటిపడుతుంది" అంటూ గోవిందలాల్ దగ్గర శెలవుతీసుకొని వెళ్ళిపోయాడు దులారామ్.

◆ ◆ ◆

గోవిందలాల్‌కిపనిచేయ. బుద్ధిపుట్టలేదు మాటిమాటికి దులారామ్ చెప్పిన మాటలే చెవుల్లో రింగుమంటున్నా, అనేక వూహలతో బుర్ర వేడెక్కిపోయింది. కన్యాలాల్ ఒకళ్లను న్యూనతపరిచేవ్యక్తా? అట్లా ఎన్నిటికి జరుగదు? ఒక వేళ దులారామ్ తప్పు చెప్పాడేమో? లేకపోతే అమ్మవాళ్లకు నగలు చేయించమని డబ్బు యిచ్చిందోలేదో? అసలు విషయం తేల్చుకోందే తనకు నిద్రపట్టదు. అతనిలో సహనశక్తి లోపించింది. తిన్నగా యింటికి బయలుదేరాడు.

ఇంటికి చేరుకొనేసరికి సాయంత్రం అవనే అయింది. యింటిముందు నుంచుని,

"అమ్మా?...అమ్మా!" అంటూ గర్జించాడు

"ఎందుకురా!" అనడిగింది లోపల పొయ్యి రాజేస్తూ.

"యిటురా!" అని మరోసారి గర్జించాడు.

ఆమె గుడిసెలోనుంచి బైటకు వచ్చి, గోవిందలాల్ వైఖరి చూచి "ఏమిటి నాయనా? ఏమి జరిగింది" అనడిగింది ఎంతో ఆతృతగా.

ఒక్కసారి ఆమెవైపు సూటిగా చూచి

"ఏమిటి నేను విన్నది నిజమేనా? నాకిస్తానన్న దుర్గనందినిని దుర్గాదాసుకి ఖాయమైందట! నీవు వాళ్ళను సరిగా కనుకొన్నావా? నీవు వాళ్ళకు డబ్బుయిచ్చావా? ఏమిటి-ఏం జరిగింది? నీకు ఈ విషయాల గురించి తెలుసా?" అంటూ ప్రశ్నపరంపర కురిపించాడు.

ఆమె ఈ విషయాలన్నీవిని నిర్వీర్యురాలైపోయింది. ఆమెలో భయం ఆవహించింది. మాట్లాడదామంటే గొంతు పూడుకుపోయింది.

"లేదు - తెలియదు నాకేమీ తెలియదు" అంది గొంతుక జీరపోయినట్లు.

"అయితే నడు. అదేమిటో తేల్చుకొందాం" అన్నాడు కరుగ్గా.

అతను గ్రామంలోకి పెద్ద పెద్ద అంగలతో నడవడం మొదలుపెట్టాడు. అతని వెనకే రుక్మిణీభాయ్ తొట్రుపాటుగా పరుగెత్తడం మొదలుపెట్టింది. వాళ్ళు అట్లా కొంతసేపు నడచి చివరకు కన్యాలాల్ యింటికి చేరుకొన్నారు. అప్పటికి చీకటి నలుమూలలా వ్యాపించింది.

కన్యాలాల్ వారింటి వరండాలోనుంచి వారిరాకను అప్పుడే చూచాడు. అతని ప్రక్క కాబోయే అల్లుడు దుర్గాదాస్ కూడా వున్నాడు. వాళ్ళను చూచి కన్యాలాల్ ఏమీ ఎరుగనట్లు కూర్చున్నాడు.

గోవిందలాల్ అభిమానం కట్టలు త్రెంపుతోంది. కళ్ళు జేవురించడం మొదలుపెట్టాయ్, వంటినిండా జెర్రులు తేళ్ళు ప్రాకినట్లుయింది. కాని తమాయించుకొని,

"నేను ఏరోజున మీ అమ్మాయిని చేసుకోడానికి రమ్మంటారు" సూటిగా అడిగాడు.

కన్యాలాల్ మొహం కొంచెం క్రిందకు వంచి "మీరిచ్చిన సొమ్ము సరిపోదు. మా అమ్మాయికి దుర్గాదాస్‌కు వివాహనిశ్చయం చేసుకొన్నాను. యికమీద మీరు యిక్కడకువచ్చి అల్లరి పెట్టడం బాగుండదు." అని లోలోపలే సణిగాడు.

"అంతేనా?" అనడిగాడు గోవిందలాల్.

"అంతేకాకపోతే, మీరిచ్చిన సొమ్ము సరిపోదు. పైగా నాకూతురుమీద హక్కు నాకుంది. నాయిష్టంవచ్చిన వాళ్ళకిచ్చి చేసుకొంటా—మీ రెవరు నన్నడగడానికి" అన్నాడు ధైర్యాన్ని కూడగట్టుకొంటూ.

గోవిందలాల్ మొహం, అతని మొహం మీద మచ్చకన్న వికృతంగా మారింది.

"అయితే! డబ్బు యిచ్చేయ్! ఊఁ! యివతల పారేయ్ డబ్బు! మేమిచ్చిన డబ్బు తీసుకురా?" కరుగ్గా, సూటిగా గర్జించాడు.

(సశేషము)

## శ్రీ సాయినిలయంలో గురు పౌర్ణమి ఆరాధన

మద్రాసు - షెణాయ్ నగరంలో ది 11-7-57న స్వామి కేశవయ్యాజీ ఆషాఢ పౌర్ణమి సందర్భమున శ్రీ సాయినిలయంలో గురుపూజను వైభవోపేతముగా జరిపిరి. శ్రీ బాబా సన్నిధిన భగవచ్చిత్ర పటములు పూలమాలలతో అత్యంతరమణీయముగా నలంకరింపబడెను. పూజాపుష్పాలతోటి, అలంకరణతోటి, ధూప, దీప, నైవేద్యాదులతోటి కలియుగ వైకుంఠముగా నొప్పిన శ్రీ బాబా సన్నిధికి అరుదెంచిన అశేష భక్తకోటికి పూజానంతరము సాయంకాలము 5½ గం॥ల నుండి రాత్రి 12 గంటలదాక విభూది ప్రసాదములను, శ్రీ సాయిబాబా తమ గురుపూజాసందర్భమున భక్తులకు కానుకలిచ్చినట్లు కొందరికి కానుకలను స్వామీజీ పంచిపెట్టిరి.

వేలకొలదిగా గుమిగూడిన భక్తులు పారవశ్యంతో శ్రీ సాయిబాబాకు ఫలపుష్పాదుల నర్పించి శ్రద్ధాభక్తులతో ఆరాధించి, కొందరు నివేదనకాగానే మధుభక్ష్యములను పంచిపెట్టిరి.